క్లుప్తంగా

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

రేగిడి: మండలంలో బాలకవివలస గ్రామంలో శుక్రవారం విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. జీసీఎస్ఆర్ కళాశాల జాతీయ సేవా పథకం-1 సేవా కార్యక్రమాలు ముగింపు సందర్భంగా వీటిని విద్యార్థులకు అందించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.పురుషోత్తం, డాక్టర్ వి.రాంబాబు తెలిపారు. వారం రోజులు పాటు గ్రామంలో విద్యార్థులు పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేశారని, గ్రామస్తులు ఎంతో సహకరించారని అన్నారు. కార్యక్రమంలో పీఓ సిహెచ్.శ్రీనివాసరావు, పంచాయతీ సర్పంచ్ వావిలపల్లి చంద్రశేఖర్, ఎంపీటీసీ బంకి హరినాధరావు, ఏనుగుతల కార్తీక్, కెప్టెన్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చొరవతో ఇంటి వారయ్యారు...



వన్నలిలో లబ్ధిదారులకు ఇంటి పట్టాలు అందజేస్తున్న సర్పంచ్ రమణ

రేగిడి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో తమ పంచాయతీలోని పేదలు ఓ ఇంటి వారయ్యారని వన్నలి పంచాయతీ సర్పంచ్ గార రమణ అన్నారు. గ్రామంలో ఏడుగురు లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చిన సొంతింటి పట్టాలు శుక్రవారం అందజేశారు. వీటితో పాటు ఇళ్ల నిర్మాణాలకు బిల్లులు మంజూరు చేశామని, నిర్మాణాలు పూర్తి చేసుకుని వీరంతా సొంత ఇంటిని చేరుకున్నారని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వీఆర్ఓ భారతి, సర్వేయర్ శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బొద్దాంలో ఇంటింటా ప్రచారం



బొద్దాంలో ప్రచారం నిర్వహిస్తున్న వైస్ ఎంపీపీ, సర్పంచ్, కార్యకర్తలు

రాజాం: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని మళ్లీ గెలిపించాలని వైస్ ఎంపీపీ నక్క వర్షిణి, బొద్దాం సర్పంచ్ నక్క తవిటమ్మ, పార్టీ మండల కన్వీనర్ శ్రీనివాసరావు కోరారు. బొద్దాంలో శుక్రవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. పార్టీ కార్యకర్తలు, గృహసారథులు, బూత్ కన్వీనర్లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

సంతకవిటి: మండల పరిధి మండాకురిటి గ్రామంలోని మంచినీటి కోనేరులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం ఏపీఓ హరనాధరావు పరిశీలించారు. మస్టర్లను తనిఖీ చేశారు. వేతనదారులను ఉద్దేశించి మాట్లాడుతూ రెండు పూటలా కొలతల ప్రకారం పని చేస్తే కనీస వేతనం రూ.272 గిట్టుబాటు అవుతుందని తెలిపారు.

ఆస్తి పన్ను వడ్డీ మాఫీ సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఆస్తి పన్ను మాఫీ అవకాశాన్ని యజమానులంతా సద్వినియోగం చేసుకోవాలని మునిసిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి అన్నారు. మున్సిపల్ కార్యాలయ సమావేశ భవనంలో అన్ని సచివాలయ కార్యదర్శులు మున్సిపల్ సిబ్బందితో ఆమె శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికి ఇచ్చిన లక్ష్యాలను త్వరగా చేరుకుని పన్ను వసూలు జోరు పెంచాలన్నారు. రెవెన్యూ అధికారి ప్రసాదరావు, వివిధ సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

'సంగమేశ్వర' ఆదాయం రూ.5,80,226



సంగాంలో హుండీ కానుకలు లెక్కిస్తున్న అధికారులు, పర్యవేక్షిస్తున్న ప్రజాప్రతినిధులు

వంగర: మండలంలోని సంగాంలో గల సంగమేశ్వర ఆలయంలో మహా శివరాత్రి రోజుల తాత్కాలికంగా ఏర్పాటు చేసిన హుండీలో భక్తులు వేసిన కానుకలను శుక్రవారం దేవదాయ శాఖ అధికారులు నేతృత్వంలో లెక్కించారు. ఆ శాఖ కార్యనిర్వహణ అధికారి టి.శివకేశరావు సమక్షంలో జరిగిన లెక్కింపులో రూ.1,17,126 సమకూరగా టికెట్టు రూపంలో రూ.4,63,100 వచ్చిందని, మొత్తం రూ.5,80,226గా అధికారులు స్పష్టం చేశారు. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ మొత్తం రూ.25,512 అధికమన్నారు. ఈ లెక్కింపు ప్రక్రియలో ఆలయ చైర్మన్ బోను నాగరాజు, ఎంపీటీసీ జి.రామకృష్ణ, తనిఖీ అధికారి పీవీ లక్ష్మీ, అర్చకులు ఎస్.గణపతిరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మల ఆర్థికాభివృద్ధికి 'చేయూత'

- ఎంపీ బెల్లాన, ఎమ్మెల్సీ విక్రాంత్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజేష్
- నియోజకవర్గంలో 20,589 మందికి రూ.38.60 కోట్ల లబ్ధి



మహిళలకు చేయూత నమూనా చెక్కును అందజేస్తున్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్సీ విక్రాంత్, నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్ తదితరులు

రాజాం సిటీ: మహిళల ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు పథకాల ద్వారా చేయూతనిచ్చారని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్ అన్నారు. చేయూత సంబరాల్లో భాగంగా శుక్రవారం స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో రాజాం పట్టణంతో పాటు నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఆసరా లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఆర్థిక పరిపుష్టి సాధిస్తే కుటుంబాలు బాగుపడతాయని నమ్మిన వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన పథకాలన్నీ మహిళలకే వర్తించే విధంగా అమలు చేపట్టారని పేర్కొన్నారు. 45 నుంచి 60 ఏళ్ల మధ్య వయసు ఉన్న మహిళలకు ఏటా రూ.18,750లు చొప్పున ఇచ్చిన మాట ప్రకారం వరుసగా నాలుగేళ్ల పాటు అందించారని గుర్తు చేశారు. ఈ డబ్బులతో ఎంతో మంది మహిళలు జీవితాలు చక్కదిద్దుకుంటున్నారని అన్నారు.

నాలుగో విడతలో రాజాం నియోజకవర్గంలోని 20,589 మంది మహిళలకు రూ.38.60 కోట్లు లబ్ధి చేకూరిందని వివరించారు. నాలుగు విడతలకు సంబంధించి మహిళల ఖాతాల్లో రూ.143.25 కోట్లు జమ చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదేనని తెలిపారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేసి మాట నిలబెట్టుకున్న నాయకుడని అన్నారు. గత ఎన్నికల్లో ఆరు వందల హామీలు ఇచ్చిన చంద్రబాబు ఒక్కటి కూడా నెరవేర్చలేదనే విషయాన్ని గుర్తెరిగి ఇప్పుడు ఆరు హామీలతో వస్తున్నాడని అన్నారు. మోసం చేయడమే చంద్రబాబు నైజమని, ఆ విషయం ఎవరూ మర్చిపోవద్దని తెలిపారు.



హాజరైన మహిళలు

ప్రజాసేవకుడిగా ఆశీర్వదించండి

నియోజకవర్గ ప్రజలకు వైద్యునిగా ఇప్పటి వరకు సేవలందించానని, ఇప్పుడు ప్రజాసేవకుడిగా ప్రజలంతా ఆశీర్వదించాలని నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ కోరారు. తనపై నమ్మకం ఉంచి రాజాం నియోజకవర్గ ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను గెలిపించడం ద్వారా జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసి ఆయన రుణం తీర్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, వైఎస్సార్ సీపీ టౌన్, రూరల్ కన్వీనర్లు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, ఎంపీపీ ఉత్తరావల్లి సురేష్‌ముఖర్జీ, ఇందిరక్రాంతి పథకం ఏపీ ఎ.చిరంజీవి, నాలుగు మండలాల ఎంఎంఎస్ అధ్యక్షులు ఎస్.అరుణ, కె.భగవతి, ఎ.సుశీల, ఎస్.సుభాషిణి, ఎంపీడీఓ బాసూరి శంకరరావు, మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడు, టీఎంసీ ఎస్‌వీ రత్నం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంతోషంగా ఉన్నాం...



ఇంత వరకు నాలుగుసార్లు చేయూత పథకం ద్వారా లబ్ధి చేకూరింది. దీంతో చిరు వ్యాపారం చేసుకుంటూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉండేందుకు వీలు కలిగింది. గతంలో ఏ పని లేకుండా ఉన్న సమయంలో కుటుంబం గడవడానికి ఇబ్బందులు పడేవాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితి నుంచి బయటపడి గర్వంగా జీవిస్తున్నాం. మళ్లీ జగనే ముఖ్యమంత్రి అయితే నాలాంటి ఎంతో మందికి ఆసరా లభించడంతో పాటు ఎన్నో కుటుంబాలు బాగుపడతాయి.

– బస్వా హైమావతి, చేయూత లబ్ధిదారు, రాజాం

వాసవీనగర్‌లో రూ.10 లక్షలతో అభివృద్ధి పనులు



వాసవీనగర్‌లో పనులు ప్రారంభిస్తున్న ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్

రాజాం: మున్సిపాల్టీ పరిధిలో వాసవీనగర్‌లో రూ.10 లక్షలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. శుక్రవారం ఈ పనులకు సంబంధించి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ మాట్లాడుతూ గతంలో టీడీపీ రాజాం మున్సిపాల్టీని పట్టించుకోలేదని దుయ్యబట్టారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత రూ.20 కోట్లతో ప్రధాన రహదారి విస్తరణ, రూ.1.03 లక్షలతో ఎర్రవాని చెరువు పార్కుగా అభివృద్ధి, రూ.1.80 కోట్లతో రాజాం ఆర్టీసీ కొత్త కాంప్లెక్స్ నిర్మాణం చేయడంతో పాటు వైఎస్సార్ పార్కులో జిమ్ ఏర్పాటు చేశామని వెల్లడించారు. రాజాం మున్సిపాల్టీలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో పాటు 14వ, 15వ ఆర్థిక సంఘ నిధులతో కలిపి ఏకంగా రూ.80 కోట్ల మేర అభివృద్ధి పనులు చేయడం జరుగుతుందని వివరించారు. వాసవీనగర్‌లో కొత్తగా సీసీ రోడ్డుతో పాటు డ్రైనేజీ నిర్మాణం చేపడుతున్నారని, 15వ ఆర్థిక సంఘ నిధులతో ఈ పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ పాలవలస గోపి, పాలవలస శ్యామ్, మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు, ఏఈ వెంకట్, వైఎస్సార్ సీపీ నేతలు దూబ గోపాలం, రెడ్డి రమేష, శాసపు వేణుగోపాలనాయుడు, సత్యనారాయణ, గోకవలస బాబూరావు, యందవ చినబాబు, యందవ సుశీల, కోల్ల రమ్య, అల్లెన జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వ ప్రాధాన్యత



ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, రాజేష్ తదితరులు

వంగర: రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, రాజాం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ తలే రాజేష్ అన్నారు. మండలంలోని సంగాం గ్రామంలో సంగమేశ్వర ఆలయం, శ్రీవారి కల్యాణ మండపం, భోగశాల, విశ్రాంత గదుల నిర్మాణం, నూతన మరుగు దొడ్ల ఏర్పాటుకు వీరు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఆలయ వైభవాన్ని పునరుద్ధరించేలా ప్రభుత్వం సీజీఎఫ్ నిధుల నుంచి రూ.కోటి మంజూరు చేయటం జరిగిందన్నారు. ఈ నిధులతో మహోన్నతమైన ఈ ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అంతకు ముందు దేవదాయశాఖ ఈఓ శివకేశవరావు నేతృత్వంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం రూ.78 లక్షలతో నిర్మాణాలు పూర్తి చేసిన సంగాం నూతన గ్రామ సచివాలయం, వెల్‌నెస్ కేంద్రం, రైతుభరోసా కేంద్రాలను ప్రారంభించారు. ఈ వ్యవస్థల ద్వారా ప్రజలకు సీఎం జగన్ మెరుగైన సేవలు గడప వద్దకే తీసుకువచ్చారన్నారు. కార్యక్రమాల్లో వంగర ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ, పార్టీ మండల అధ్యక్షుడు కరణం సుదర్శనరావు, సర్పంచ్ గేదెల రామకృష్ణ, ఎంపీటీసీ జి.పారమ్మ, తహసీల్దార్ చిరంజీవి పడాల్, ఎంపీడీఓ సాల్మన్ రాజ్, అర్చకులు గణపతిరావు, ఉగిరి ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

రివాల్వింగ్ ఫండ్‌తో మహిళల అభివృద్ధి

బొబ్బిలి: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రివాల్వింగ్ ఫండ్ సహాయంతో మహిళలు మరో మెట్టు ఎదగనున్నారని మున్సిపల్ చైర్మన్ ఎస్‌వీ మురళీ కృష్ణారావు అన్నారు. పట్టణంలోని గొల్లపల్లి, ఇందిరమ్మ కాలనీ ప్రాంతాల్లో మెప్మా ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సమృద్ధి యూనిట్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ బొబ్బిలి పట్టణంలో మెప్మాలో 1400 పొదుపు సంఘాలకు గానూ 50 ఎస్.ఎల్.ఎఫ్ గ్రూప్‌ల్లో ఒక్కొక్క ఎస్.ఎల్.ఎఫ్‌కు రూ.50వేలు చొప్పున రివాల్వింగ్ ఫండ్ ప్రభుత్వం ద్వారా బలోపేతం కోసం ఇవ్వడం జరిగిందన్నారు. ఈ ఫండ్‌ను ఎస్.హెచ్.జి సభ్యులు వ్యాపారం చేసుకొని అభివృద్ధి చెందే విధంగా ప్రభుత్వం సహాయ సహకారాలు అందజేస్తుందన్నారు. మహిళలు ఆర్థికంగా బలోపేతమై తమ కాళ్లపై వారే స్వచ్ఛందంగా జీవించేలా ప్రభుత్వం అన్ని విధాలా తన వంతు సాయం అందజేస్తుందన్నారు. దీన్ని మహిళలు గుర్తించి ఆర్థికంగా ఎదగాలన్నారు. మహిళా సాధికారత సాధించాలని పేర్కొన్నారు. బొబ్బిలి మెప్మా తరపున రూ.25లక్షల ఆర్థిక సహాయంతో వివిధ ఉపాధి కార్యక్రమాలు చేపడుతూ మహిళలు ముందడుగు వేయడం అభినందనీయం అన్నారు. ఈ తరహా ఉపాధి కార్యక్రమాలకు పట్టణ సమృద్ధి యూనిట్ అని పేరు పెట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కాలనీ వార్డు ఇన్‌చార్జ్ చంద్రపూడి రమేష్, మెప్మా సీఎంఎం రాము, సీఓలు, ఆర్‌పీలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష'తో సంపూర్ణ ఆరోగ్యం



రాజాం సిటీ: ఒమ్మిలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం

రాజాం సిటీ: ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి ఒక్కరికి సేవలు చేరువయ్యాయని ఎంపీడీఓ బాసూరి శంకరరావు అన్నారు. మండల పరిధి ఒమ్మి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష సేవలను ఆయన పరిశీలించారు. డాక్టర్ టీవీ సత్యప్రకాష్, శైలజ, ప్రవీణ్‌కుమార్, ఈఓపీఆర్‌డీ వి.శ్రీనివాసరావు, కె.ఈశ్వరరావు పాల్గొన్నారు.

సురక్షతో అందరికీ ఆరోగ్యం

రేగిడి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రతీ ఒక్కరికి మంచి ఆరోగ్యం చేకూరుతుందని బూరాడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చలమయ్య అన్నారు. మండలంలోని లింగాలవలస గ్రామంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు తనిఖీలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించారు. ఎంపీటీసీ రెడ్డి నర్సింగరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు మేలు

బాడంగి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో పేదలకు ఇంటి వద్దనే వైద్యసేవలు అందుతున్నాయని సచివాలయ కన్వీనర్ గండి శంకరరావు అన్నారు. మండలంలోని డొంకినవలస విలేజ్ క్లినిక్ వద్ద జగనన్న రెండో విడత ఆరోగ్య సురక్ష శిబిరాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. సర్పంచ్ బంకురు సింహాచలం, ఎంపీడీఓ ఆంజనేయులు, ఈఓపీఆర్‌డీ సూర్యనారాయణ, ప్రత్యేక వైద్యులు నాగేశ్వరరావు, సూపర్‌వైజర్ నిర్మలాదేవి, ఏఎన్ఎం లక్ష్మి, ఆశా వర్కర్లు, 104 సిబ్బంది సేవలు అందించారు.

ఇంటర్ విద్యార్థి డీబార్

వంగర: మండల పరిధిలోని మద్దువలస ప్రభుత్వ ఇంటర్ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు రాస్తున్న ఓ విద్యార్థి శుక్రవారం డీబార్ అయినట్లు చీఫ్ సూపరింటెండెంట్ కొరటాన నారాయణరావు తెలిపారు. ద్వితీయ ఇంటర్ కెమిస్ట్రీ పరీక్ష జరుగుతుండగా ఓ విద్యార్థి స్లిప్ వినియోగిస్తూ సిట్టింగ్ స్క్వాడ్ కె.రమణకు పట్టుబడినట్లు ఆయన తెలిపారు.

టీడీపీకి గుణపాఠం తప్పదు



మాట్లాడుతున్న సర్పంచ్ చిన్నంనాయుడు, ఎంపీటీసీ కాంతారావు

రాజాం: అంతకాపల్లి పంచాయతీ వైఎస్సార్ సీపీ క్యాడర్‌పై అసత్య ప్రచారాలు చేస్తే టీడీపీకి తగిన గుణపాఠం చెప్పక తప్పదని పంచాయతీ సర్పంచ్ వాకముల్ల చిన్నంనాయుడు, వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులు బొరోతు కాంతారావులు టీడీపీని హెచ్చరించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. రెండు రోజులు క్రితం తమ పంచాయతీ నుంచి వైఎస్సార్ సీపీ కార్యకర్తలు టీడీపీలో చేరినట్లు ప్రచారం చేశారని, ఇదంతా అవాస్తవమని అన్నారు. తమ గ్రామం నుంచి వైఎస్సార్‌సీపీకి చెందిన మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, వార్డుమెంబర్లు, కార్యకర్తలు ఎవరూ పార్టీని వీడలేదని పేర్కొన్నారు. బ్లాక్ మెయిల్ రాజకీయం చేస్తే తగిన మూల్యం చెల్లించుకోవల్సి ఉంటుందన్నారు. ఉపసర్పంచ్ లెంక అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ పోతురాజు బ్రహ్మంనాయుడు, పెద్ది తవిటినాయుడు, లెంక శ్రీనివాసరావు, కురిటి సూర్యారావు, డబ్బాడ గణనాధ, టి.వెంకటనాయుడు, కె.వెంకటనాయుడు, నర్సుములు, ఎ.పారన్నాయుడు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా నేత్రోత్సవం

రాజాం సిటీ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం స్థానిక బొబ్బిలి రోడ్డులోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి 98వ జాతరను పురస్కరించుకుని శుక్రవారం నేత్రపర్వంగా నేత్రోత్సవం చేశారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వాకచర్ల దుర్గాప్రసాద్ ఇంటి నుంచి ఊరేగింపుగా పుసుపు, కుంకాలను తీసుకువెళ్లి అమ్మవారికి సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. పూజలు అనంతరం అమ్మవారి ప్రతిమలను గుడి నుంచి కొండంపేట గ్రామంలో ఉన్న ప్రధాన పూజారి లంకలపల్లి సత్యనారాయణ ఇంటి వద్దకు తరలించారు. అక్కడ నుంచి జాతర చివరి రోజు మంగళవారం ఘటోత్సవంలో భాగంగా అమ్మవారి గుడికి వీటిని తిరిగి చేర్చడంతో జాతర ముగుస్తుంది. భక్తులు అధిక సంఖ్యలో నేత్రోత్సవంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో వాకచర్ల కుటుంబీకులు, సలాది కుటుంబీకులు, ఈఓ బీవీ మాధవరావు, ఆలయ అర్చకులు వేమకోటి సూర్యనారాయణ శర్మ, ఆలయ పర్యవేక్షకులు సలాది తులసీదాస్, వెంపల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

గ్లకోమా వ్యాధిపై అవగాహన అవసరం

సంతకవిటి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ప్రపంచ గ్లకోమా వారోత్సవాల సందర్భంగా శుక్రవారం జిల్లా అంధత్వ సంస్థ విజయనగరం ఆధ్వర్యంలో గ్లకోమా వ్యాధి నిర్ధారణ పరీక్షలు, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆఫ్తాలమిక్ ఎస్.వసంతరావు మాట్లాడుతూ గ్లకోమా వ్యాధిపై అవగాహన అవసరం అన్నారు. వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. సామాజిక ఆరోగ్య అధికారి బి.రాజరత్నం, హెల్త్ విజిటర్ సెట్టి సత్యవతి, ఫార్మసిస్ట్ శివభాస్కరం, రవి పాల్గొన్నారు.

శిక్షణ సద్వినియోగం కావాలి



శిక్షణలో మాట్లాడుతున్న గోవిందరావు

రేగిడి: రాష్ట్ర స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ఇస్తున్న శిక్షణను యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా స్కిల్ డవలప్‌మెంట్ అధికారి గోవిందరావు అన్నారు. ఉంగరాడ మెట్ట వద్ద కార్పెంటరీ పనికి సంబంధించి శిక్షణా శిబిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇటువంటి కార్యక్రమాలు ద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు స్వయం ఉపాధి లభిస్తుందని అన్నారు. శిక్షణ అనంతరం స్వయం ఉపాధి పరిశ్రమలు స్థాపించేందుకు బ్యాంకు లింకేజీలు ద్వారా రాయితీ రుణాలు అందించనున్నామని వెల్లడించారు. బొత్స గురివినాయుడు మెమోరియల్ ఎడ్యుకేషన్ సొసైటీతో పాటు స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్‌లు సంయుక్తంగా జిల్లా కలెక్టర్ భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాలు నిర్వహణ జరుగుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో మేనేజర్ రవికిరణ్, ట్రైనర్ సింహాచలం, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ గణపతి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి



చాకలివీధిలో సీసీ డ్రైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న డాక్టర్ తలే రాజేష్

రాజాం సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలోనే సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, ఈ ప్రభుత్వంలోనే ప్రతి వార్డు అభివృద్ధి చెందిందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. పట్టణ పరిధి వాసవీనగర్‌లో రూ.10 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు, కాలువ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. పొనుగుటివలస గ్రామంలో రూ.లక్షలతో మంచి నీటి కోనేరుకు రాతికట్టు, రూ.1.20 లక్షలతో చాకలి వీధి, శెగిడివీధుల్లో సీసీ డ్రైయిన్ల నిర్మాణం కోసం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ప్రజలందరికీ మేలు జరిగిందన్నారు. ప్రజలకు మంచి జరిగిందంటేనే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేయాలని సూచించారు. ప్రజలంతా విజ్ఞతతో ఆలోచించి రానున్న ఎన్నికల్లో తనను గెలిపించడం ద్వారా జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంను చేయాలని అన్నారు. కార్యక్రమంలో టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, శాసపు వేణుగోపాల్, రెడ్డి రమేష్, పాలవలస గోపి, కిల్లాన మోహన్, రెడ్డి శ్రీనివాసరావు, గార సత్యనారాయణ, వావిలపల్లి నాయుడు, శాసపు అప్పలనాయుడు, లెంక చిన్నప్పలనాయుడు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి : ఎంఈఓ



హెచ్‌ఎంలు, సచివాలయ ఇంజినీరింగ్ సహాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ

రామభద్రపురం: నాడు – నేడు పథకం కింద పాఠశాలల ఆధునీకరణ పనులకు బిల్లులకు ఢోకా లేదని, పనులు వేగవంతం చేయాలని ఎంఈఓ తిరుమల ప్రసాద్ అన్నారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో మండలంలోని నాడు నేడు ఫేజ్ 2 కింద ఆధునీకరణ పనులు చేపడుతున్న పాఠశాలలకు చెందిన హెచ్‌ఎంలు, సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో పనులు పూర్తి చేసి నగదు ఖర్చు చేయకపోతే ఆయా పాఠశాలల పేరెంట్స్ కమిటీ ఖాతాలో ఉన్న నగదును డీఈఓ ద్వారా నగదు అవసరమైన పాఠశాలలకు బదిలీ చేస్తారన్నారు. ఖర్చు చేసిన నగదుకు పేరెంట్స్ కమిటీ తీర్మానం తప్పనిసరన్నారు. ముందుగా 10 కాంపోనెంట్లు పూర్తి చేయాలని సూచించారు. ఖర్చులకు సంబంధించిన బిల్లులు వెంటనే అప్‌లోడ్ చేయాలన్నారు. అలాగే నాడు-నాడు పనులకు సంబంధించిన రికార్డులు సకాలంలో అప్డేట్ చేయాలని సూచించారు. హెచ్‌ఎంలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు సంయుక్తంగా పనులు పారదర్శకంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 పెంటయ్య పాల్గొన్నారు.

తీరిన తాగునీటి కష్టాలు



తాగునీటి కుళాయిల ద్వారా నీరు పడుతున్న మహిళలు

రామభద్రపురం: కొట్టక్కి ఎరుకుల వాడ కాలనీ వాసుల తాగునీటి సమస్య తీరింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఆ కాలనీలో ఇంటింటికీ వెళ్లినప్పుడు అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి కూడా వారు సమస్యలపై పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యేకు వివరించారు. ముఖ్యంగా తాగునీటి సమస్యను చెప్పారు. స్పందించిన ఎమ్మెల్యే శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ.05 లక్షలతో మినీ ట్యాంకు ఏర్పాటు చేసి ఇంటింటికీ పైపులైన్ వేసి, ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేశారు. దీంతో దశాబ్దాలుగా మా కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్య తీరిందని ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యేకు, జెడ్పీటీసీకి కృతజ్ఞతలు తెలిపారు.

కొండవలసలో తీరనున్న తాగునీటి కష్టాలు



కొండవలసలో జల జీవన్ మిషన్ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఇన్‌చార్జ్ రాజేష్ తదితరులు

రేగిడి: మండలంలోని కొండవలస గ్రామంలో తాగునీటి కష్టాలు తీరనున్నాయని శాసనమండలి విప్ పాలవలస విక్రాంత్ అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజాం ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్‌తో కలసి కొండవలస గ్రామంలో జల జీవన్ మిషన్ పనులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండవలస గ్రామాన్ని గత టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ గ్రామంలో బోర్లు ద్వారా తాగునీటిని అందించే చర్యలు చేపట్టామని, ఇప్పుడు శాశ్వతంగా సమస్యను పరిష్కరించేందుకు జల జీవన్ మిషన్ నిధులు మంజూరు చేశామని అన్నారు. రూ.67 లక్షలతో ఈ గ్రామంలో ప్రతీ ఇంటికి తాగునీరు అందనుందని అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతోనే ఇది సాధ్యమైందని వెల్లడించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, సర్పంచ్ భేరి మోహనరావు, మాజీ సర్పంచ్ వెంకటరమణ, రేగిడి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు నెల్లి పెంటన్నాయుడు, బెవర జగన్నాథం, బెవర సుధాకరరావు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఎన్నికల నియమావళి అమలు చేయాలి

తెర్లాం: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి గ్రామాల్లో ఎన్నికల నియమావళిని మండల, గ్రామ స్థాయి అధికారులంతా పక్కాగా అమలు చేయాలని ఎంపీడీఓ బి.మధుసూదనరావు అన్నారు. మండల పరిషత్ సమావేశ భవనంలో మండల, గ్రామ స్థాయి అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నియమావళిలో భాగంగా గ్రామాల్లో పార్టీలకు సంబంధించిన బ్యానర్లు, బారికేడ్లు, వాల్‌పోస్టర్లు తొలగించాలన్నారు. గ్రామాల్లో రాజకీయ పార్టీల నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలని సూచించారు. ఎన్నికల నియమావళిని అధిగమించేలా రాజకీయ నాయకులు, వివిధ పార్టీల కార్యకర్తలు ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకొనేందుకు వెనుకాడవద్దని సూచించారు. గ్రామాల్లో ఎటువంటి అల్లర్లు, ఓటర్లను ప్రలోభపెట్టే చర్యలు చేపడితే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని అన్నారు. ఎస్ఐ ఆర్.రమేష్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు పూర్తయ్యే వరకు గ్రామాల్లో ప్రతీ చిన్న విషయాలను కూడా పరిశీలన చేయాలన్నారు. హెచ్‌టీడీ భాస్కరరావు, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ డీవీ అప్పారావు, ఈఓపీఆర్, బీఎల్ఓలు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్ఓలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.